క్లుప్తంగా

వైభవంగా అనఘాష్టమి



అనఘాష్టమి వ్రతంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం మార్గశిర బహుళ అష్టమి (ప్రధాన అనఘాష్టమి) పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయస్వామి మూల విగ్రహానికి ప్రాతఃకాల అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనఘాదేవి సమతే అనఘాస్వామి వార్ల వ్రతాలను సామూహికంగా ఆచరించారు. ఆలయ ట్రస్టు సభ్యులు, మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు



అతిథులను సన్మానిస్తున్న ఉర్దూ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసినపుడే నూతన ఆవిష్కరణలు ఆవిష్కృతమవుతాయని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీఎస్ఐఆర్, టీటీసీఐసీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.జోష్న అన్నారు. సోమవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో పద్మావతి యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'డీఎస్ఐఆర్ – ప్రిజం ప్రమోషన్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్' అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్ జరిగింది. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పి.ఎస్.షా వలి ఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జోష్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్‌పై దృష్టి సారించిందన్నారు. ద్రవిడియన్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరదరాజులు నాయుడు మాట్లాడారు. అనంతరం జోష్న, వరదరాజులు నాయుడును ఘనంగా సన్మానించారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): చెన్నై పట్టణంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు స్థానిక తాండ్రపాడులోని బ్రైడో విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన ఆశీష్, జెస్సికాలను సోమవారం పాఠశాల డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపాల్ శ్రావ్యలక్ష్మి అభినందించారు. వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కర్నూలు(అర్బన్): కళాశాల విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీలు చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రయత్నం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ వెంకట శేషాద్రి కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలోని విద్యార్థినీలకు న్యాయ సేవల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీలకు నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టం – 1985 గురించి తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15100ను ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే వసతి గృహంలోని పరిసరాలు, పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. హాస్టల్‌లో ఏవైనా లోపాలు, సమస్యలు ఉంటే వాటిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 30, 31 తేదీల్లో కర్నూలులో నిర్వహించే ఏఐవైఎఫ్ 16వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వెంటనే 10 వేల మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమను స్థాపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌తోపాటు గ్రూపు పరీక్షలను నిర్వహించాలన్నారు. కానిస్టేబుల్ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో తీర్మానాలు చేసి సాధన కోసం ఉద్యమ కార్యచరణను రూపొందిస్తామని వివరించారు. నాయకులు నాగరాజు, బీసన్న, చంటి, కుమార్, నాగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావుకు నివాళి

కర్నూలు(సెంట్రల్): మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 20 వవర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఘనంగా నివాళులర్పించింది. శుక్రవారం కళా వెంకట్రావు భవన్‌లో (డీసీసీ) నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆధ్వర్యంలో ముందుగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక గుర్తింపు పొందిందని, ఆయన తెచ్చిన సంస్కరణలతోనే దేశం పురోభివృద్ధిలో పయనిస్తోందని పేర్కొన్నారు. నాయకులు బజారన్న, సయ్యద్‌నవీద్, ప్రమీళ, షేక్ ఖాజా హుస్సేన్, ఈ.లాజరస్, డీవీ సాంబరావు పాల్గొన్నారు.

మేలుకో వినియోగదారుడా!

- ఏ వస్తువు కొన్నా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి
- వస్తుసేవల్లో లోపముంటే న్యాయం పొందేందుకు అవకాశం
- వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు
- నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య



జిల్లా వినియోగదారుల కమిషన్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): సమాజంలో ఎక్కడ చూసినా మోసాలు, నాణ్యతలేని వస్తువుల విక్రయాలు అధికమయ్యాయి. వాటిని నమ్మి కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అలా నష్టపోకుండా వినియోగదారుల రక్షణ చట్టం అమల్లో ఉంది. ఈ చట్టం ప్రకారం ఏ వస్తువును కొనుగోలు చేసినా దానికి సంబంధించిన బిల్లును తప్పనిసరిగా పొందాలి. బిల్లు ఆధారంగా జిల్లా లేదా రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఆధ్వర్యంలో 200 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశారు. నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందండి

గుండు పిన్ను నుంచి గూగుల్ సేవల వరకు, పాల నుంచి ఫార్మా కంపెనీల కల్తీ వరకు, రియల్ ఎస్టేట్ మోసాల నుంచి కార్పొరేట్, ఈ–కామర్స్ సంస్థల దోపిడీ వరకు.. ఎక్కడైనా వస్తుసేవల్లో మోసం జరిగినా.. నాణ్యత లోపించినా వినియోగదారులు నేరుగా జిల్లా కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. రూ.5 లక్షల్లోపు మోసాలకు ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించకుండానే తగిన పరిహారం పొందవచ్చు. నేరుగా కమిషన్‌లో తెలుగులో ఫిర్యాదు రాసి ఇవ్వవచ్చు. న్యాయవాది అవసరం లేకుండానే పోరాటం చేయవచ్చు. రూ.5 లక్షలు, ఆపైన వివాదాలకు కోర్టు ఫీజులతోపాటు న్యాయవాదులను నియమించుకోవచ్చు. అంతేకాక ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనూ చేయవచ్చు.

వాట్సాప్‌లోనూ ఫిర్యాదుల స్వీకరణ

ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులను అంటగట్టినా ఇక నుంచి మీ ఇంటి నుంచే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కేంద్ర వినయోగదారుల మంత్రిత్వ శాఖ ఇందుకోసం వాట్సాప్ చాట్ బాట్‌ను సేవలను తీసుకొచ్చింది. వాట్సాప్ నంబర్ 8800001915 నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నంబర్‌ను సేవ్ చేసుకని హాయ్.. అని టైప్ చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు అవుతుంది, అనంతరం కేసు పరిష్కారం కోసం ఆ వివరాలు సంబంధిత జిల్లాలకు కమిషన్ పంపుతుంది. కేసు పరిష్కారం అయ్యేవరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. దీంతోపాటు 1800 114 000 లేదా 1915 నంబర్‌కు కాల్ చేసి ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఫిర్యాదులను పంపవచ్చు.

పార్కింగ్ ఫీజు.. క్యారీబాగ్‌కు డబ్బు తీసుకోరాదు

షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ ఫీజు వసూలు చేయడానికి వీల్లేదు. అలాగే పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో క్యారీ బ్యాగ్‌కు ప్రత్యేకంగా డబ్బులు వసూలు చేయడానికి అధికారం లేదు. ఈ మేరకు రాష్ట్ర, జాతీయ వినియోగాదారుల వివాదాల పరిష్కార కమిషన్ స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. కర్నూలు నగరంలో కొన్ని మాల్స్, సూపర్ మార్కెట్లలో చట్టవిరుద్ధంగా వినియోగదారుల నుంచి పార్కింగ్, క్యారీ బ్యాగ్‌ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ రెండు చట్ట ఉల్లంఘనలకు సంబంధించి ఎవరైనా వినియోగదారులు లేదా వినియోగదారుల హక్కుల కోసం ఉద్యమించే వారు తగిన ఆధారాలతో కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే విచారించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చేబుతోంది.

చట్టంపై అవగాహన అవసరం

వినియోగదారుల రక్షణ చట్టం – 2020పై అవగాహన లేకపోవడంతో వస్తువుల కొనుగోలులో వ్యాపారులు చేసే మోసాలకు చట్టపరంగా పరిహారం పొందే అవకాశాన్ని వినియోగదారులు కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నా ప్రజల్లోకి వెళ్లడం లేదు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు, ఆహారం, విద్య, వైద్యం, ఆరోగ్యం, వాణిజ్య పన్నులు, రోడ్లు, రవాణా శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించాలి. అయితే అధికారులకు తీరిక లేకనో అవగాహనపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాగా, ఈ నెల 18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వినియోగదారుల చట్టాలు, హక్కులు, ఉల్లంఘనలపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు.

నేడు సిల్వర్ జూబ్లీ కాలేజీలో సదస్సు

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో వినియోగదారుల రక్షణ చట్టం–2020పై అవగాహన కల్పిస్తారు. వినియోగదారుల జాతీయ దినోత్సవంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన కాలేజీ, స్కూలు విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి జేసీ డాక్టర్ బి.నవ్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

వినియోగదారుల హక్కులు కాపాడతాం



వినియోగదారుల హక్కులు కాపాడడం మా ప్రథమ కర్తవ్యం. మోసపోయిన వారు కమిషన్‌ను ఆశ్రయిస్తే తగు న్యాయం చేస్తాం. రూ.5 లక్షల వరకు మోసాలకు ఎలాంటి ఫీజు ఉండదు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు తీసుకుంటాం. మార్టులు, మాల్స్‌లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడానికి కమిషన్ సిద్ధంగా ఉంది. – కరణం కిశోర్, చైర్మన్, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు



మార్కెట్‌లో వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లు తీసుకోవాలి. బిల్లు తీసుకోకపోతే కచ్చితంగా మోసపోయినట్టే. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. కాలేజీలు, స్కూలు విద్యార్థులకు అవగాహన కోసం చర్యలు తీసుకుంటున్నాం. వారికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నాం. అన్యాయం జరిగితే వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాలి. – రాజారఘువీర్, డీఎస్ఓ

నేటి నుంచి జానపద సంగీత నృత్యోత్సవాలు

కర్నూలు కల్చరల్: భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సూర్య కళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో జానపద సంగీత నృత్యోత్సవాలను నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు సోమశంకరయ్య, పద్మావతి తెలిపారు. ఏక్యాంప్‌లోని హర్ట్ ఫౌండేషన్‌లో ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు జానపద గీతాలు, డప్పుల విన్యాసాలు, 7.30 గంటలకు జానపద నృత్యాలు, కోలాటాలు ఉంటాయని తెలిపారు. విశ్రాంత వైద్యాధికారులు పి.చంద్రశేఖర్, జి.భవానీప్రసాద్, స్త్రీ వైద్య నిపుణురాలు వై.రాధిక అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

దంత సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన ఉండాలని దంత వైద్యుల సంఘం రాయలసీమ బ్రాంచ్ సెక్రటరీ డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి అన్నారు. జాతీయ దంత వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్ పేటలోని శ్రీలక్ష్మి స్కూల్‌లో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉడికీ ఉడకని ఆహారం, జంక్‌ఫుడ్ పదార్థాలు పంటిపై ఉండిపోయి ఎనామిల్‌ను పాడు చేస్తాయని, దీన్ని నివారించేందుకు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలన్నారు. ఆహారం తిన్న తర్వాత మౌత్ వాష్ చేసుకోవడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను అరికట్టవచ్చన్నారు. సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ నౌషాద్, సీడీఈ కన్వీనర్ డాక్టర్ మజర్, డాక్టర్ పశుపతి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: యువత సామాజిక బాధ్యత కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. సోమవారం మాదక ద్రవ్యాల నివారణకు సంబంధించి వర్సిటీలో విద్యార్థులకు వ్యాసరచన, లఘుచిత్రాలు, ఇన్‌స్టాగామ్ రీల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలను పరిశీలించిన వీసీ మాట్లాడుతూ.. వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, ర్యాగింగ్, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాపులు తొలగించారు.. జీవనోపాధి కల్పించండి




అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతిపత్రాలు ఇస్తున్న నగర ప్రజలు

కర్నూలు (టౌన్): కొండారెడ్డి బురుజు వద్ద కాలువ నిర్మాణం కోసం తమ షాపులు తొలగించారు. జీవనోపాధి కోల్పోయిన తమకు తిరిగి అక్కడ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని స్థానికులు సుభాన్, నజీర్, శ్రీనివాసులు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు కమిషనర్‌ను కలిసి వినతిపత్రాలు అందించారు. ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- భాస్కర్ నగర్ రహదారి పక్కన తన కూరగాయల షాపును తొలగిస్తామని బెదిరించి మల్లికార్జున, శ్రీనివాసులు అనే వ్యక్తులు రూ.30 వేలు ఫోన్ ద్వారా తీసుకున్నారని దావుద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- జొహరాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో మారుతినగర్ వైపు రహదారి అధ్వానంగా ఉందని, సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు ప్రకాష్, రామిరెడ్డి అభ్యర్థించారు.
- గోపీనగర్, శ్రీనివాసనగర్‌లో మురుగు కాల్వలు నిర్మించాలని, 28వ వార్డుకు చెందిన సుదర్శన్ రెడ్డి, రాముడు, దేవరాజు, సరస్వతి, వెంకటరాముడు విన్నవించారు.
- వెంకటాద్రినగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు హుస్సేన్ సాహెబ్ అభ్యర్థించారు.
- స్టేడియం వద్ద మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోందని తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్ర గౌడ్ కోరారు.
- 17వ వార్డు ఎల్‌బీ నగర్‌లో అసంపూర్తిగా ఉన్న రహదారులు, మురుగు కాల్వలు పూర్తి చేయాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, రాజు అర్జీ ఇచ్చారు.
- సుల్తానీయ ఈద్గా వద్ద పైపులైన్ పదే పదే లీకేజీ అవుతుందని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు నూర్ అహమ్మద్ కోరారు.

హాకీ విజేత గార్గేయపురం జట్టు



విజేతగా నిలిచిన గార్గేయపురం బాలికల హాకీ జట్టు

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని రెండు రోజులుగా స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ కప్ హాకీ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుపై 3 – 0 స్కోర్‌తో గార్గేయపురం జట్టు గెలిచింది. అలాగే బాలుర విభాగంలో గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై 1-0 స్కోర్‌తో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. బహుమతుల కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ కార్యదర్శి జయాకర్, ప్రవీణ్, హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ విజేతలుగా నిలిచిన జట్లకు మెడల్స్, కప్పును అందజేశారు. విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ రంగస్వామి విజేతలకు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

బాలికలను సంరక్షించాలి



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ఆడపిల్లలు జన్మించడం అదృష్టంగా భావించాలని, వారిని మగపిల్లలతో సమానంగా పెంచాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. సోమవారం ఇందిరమ్మ హౌసెస్ యూపీహెచ్‌సీ పరిధిలోని పెద్దపాడు గ్రామంలో దామోదరం సంజీవయ్య స్మారక బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ×బాలికలను రక్షించండి–బాలికలను చదివించండి¶ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌమార దశలోని ఆడపిల్లలకు వివాహం చేయడం వల్ల వారు చిన్న వయస్సులో గర్భం దాల్చి తీవ్ర అనారోగ్యానికి గురౌతారన్నారు. విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనతకు గురౌతారని, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనుకబడతారని చెప్పారు. ప్రతి గురువారం పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రలు భోజనం తర్వాత మింగాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ హరిత, తదితరులు ఉన్నారు.

టెర్రస్ గార్డెనింగ్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎల్లప్ప

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్గానిక్ టెర్రస్ గార్డెనింగ్‌లో విశేషంగా రాణిస్తున్న గుజరాతీ ఎల్లప్ప, సుష్మ దంపతులకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక పురస్కారం లభించింది. ఈ దంపతులు స్థానిక లక్ష్మీనగర్‌లో ఇంటిపై కప్పుపై దాదాపు 650 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50కిపైగా రకాలతో 250 మొక్కలతో మిద్దెతోటను ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి కెమికల్స్ వాడకుండా పూర్తిగా పశువుల ఎరువులు, చెరువుమట్టి, వర్మీకంపోస్టు, కిచెన్ వ్యర్థాలను వినియోగిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఉత్పత్తి చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలతో పాటు మిద్దెపైనే జామ, అంజూర, స్టార్‌ఫ్రూట్స్, మల్బరీ, అరటి వంటి పండ్ల చెట్లను కూడా పెంచారు. పనికి రాని ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సంచులు, డ్రమ్ములు తదితర వాటిని మొక్కలు నాటేందుకు వినియోగిస్తున్నారు. మూడేళ్లగా కుటుంబానికి అవసరమైన కూరగాయలను ఇంటిపైనే పండించుకుంటున్నారు. మిద్దెతోటలో విశేషంగా రాణిస్తున్న ఎల్లప్ప, సుష్మా దంపతులకు రైతుసేస్తం అవార్డు లభించింది. సోమవారం గుంటూరులో జరిగిన కార్యాక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, ప్రముఖ మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరావు నుంచి వారు అవార్డు అందుకున్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



ఆందోళన చేస్తున్న మెప్మా ఆర్పీలు



ఆందోళన చేపట్టిన రైతు సంఘాలు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సంఘాల ఆందోళనతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది. పెండింగ్ వేతనాలు కోసం మెప్మా ఆర్పీలు ధర్నా నిర్వహించగా.. అంబేడ్కర్‌ను కించపరచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం, కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేశాయి. రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని కోరుతూ సంఘాలు ఆందోళన చేపట్టాయి.

- కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన తెస్తున్న జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్‌తో దీక్ష విరమింపజేయాలని కోరుతూ సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఢిల్లీకి వెళ్లే సందర్భంలో అరెస్టు చేసి లక్సర్ జైలులో ఉంచిన రైతు సంఘాల నాయకులందరినీ విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యాదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు.
- పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి, నగర అధ్యక్షురాలు షబానా ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు.
- డాక్టర్ బాబా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.
- అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్ చేపట్టారు. నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా ఆధ్వర్యంలో రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. యూకేజీ డాఫోడైల్స్ ఉపాధ్యాయురాలు మార్టీనా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రిస్మస్ గీతాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. మెర్రీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సందడి చేశారు. పాఠశాల అధినేత రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ మహబూబ్‌బాషా, తదితరులు

కర్నూలు(అర్బన్): నీవలే నీ పొరుగు వారిని కూడా ప్రేమించు అనే ఏసు ప్రభువు మాటలు ప్రపంచానికే ఆదర్శమని ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్ సమీపంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ ఐక్య సమితి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ సందడి కార్యక్రమం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు రెడ్డిపోగు రాజ్‌కుమార్, ఏపీ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, రెవరెండ్ ఆర్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రెవరెండ్ అస్కనాజు, పాస్టర్లు మత్తయ్య, యువరాజ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బతుకన్న హాజరయ్యారు. కేక్ కట్ చేసి దైవ సందేశాన్ని వినిపించారు.

కర్నూలు (టౌన్): ప్రైజ్ ది లార్డు గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబానగర్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. చిన్నారులు క్రీస్తు జననంపై చిరు నాటిక ప్రదర్శించారు. దైవ సందేశకులు కె.సంతోష్‌కుమార్ దేవుని వాక్యం అందించారు. అనంతరం క్రీస్తును స్తుతిస్తూ క్యాండిల్ లైటింగ్ నిర్వహించారు.జయంతి, సంతోష్ కుమార్, రాజశేఖర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు